# నా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

## కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి


కొంపల్లిలో ప్రచారంలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి


కొంపల్లిలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ


సాయిబాలాజీ టవర్స్ అసోసియేషన్ సమావేశంలో కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: తెలంగాణలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. కుత్బుల్లాపూర్ నుంచి తన విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం కొంపల్లి నుంచి దూలపల్లి వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు పరుస్తామన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ యువతకు 2 లక్షల పైచీలుకు ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు.

◆ ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి తనను అసెంబ్లీకి పంపాలని హన్మంతరెడ్డి కోరారు. ఈ ర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ నాగులూరుకు చెందిన ప్రవీణ్, మోహన్‌ల ఆధ్వర్యంలో నవీన్, కిరణ్, సదానంద్, ప్రవీణ్, నవీన్, సురేష్, రఘురామ్, సురేష్, వినయ్, విగ్నేష్, రామ్, సదానంద్, మల్లికార్జున, రాంబాబు, కిరణ్, శ్యామ్, జైరాం,అర్జున్, మధిన్, భరత్, శ్యామ్, శ్రీకాంత్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ గాజులరామారం ప్రాంతానికి చెందిన జయరామ్‌రెడ్డి, అరుణల ఆధ్వర్యంలో జరిగిన కేదార్‌నాథ్‌స్వామి పూజలో కొలన్ హన్మంతరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

◆ సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో సాయిబాలాజీ టవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కొలన్ హన్మంతరెడ్డి హాజరై కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డికి మద్దతుగా కాలనీ వాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోపాలకృష్ణ, సురేష్ బాబు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆర్. లక్ష్మి, కృష్ణ, సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొలన్ హన్మంతరెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిజాంపేట్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరిస్తూ హన్మంతరెడ్డిని గెలిపించాలని కోరారు.


కాంగ్రెస్‌లో చేరిన నాగులూరు యువకులతో కొలన్ హన్మంతరెడ్డి


ప్రచార వాహనంపై ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తూ..


కొంపల్లిలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో వివేకానంద్ అభివాదం


తండ్రి వివేకానంద్ వెంట ప్రచారంలో పాల్గొన్న తనయుడు విధాత్

# కారు.. ప్రచార జోరు

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్న అభ్యర్థి వివేకానంద్
- కారు గుర్తుకే ఓటు వేసి అభివృద్ధిని కొనసాగించాలని అభ్యర్థన


కుత్బుల్లాపూర్‌లో ప్రచారంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు


కుత్బుల్లాపూర్‌లో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న వివేకానంద్


వివేకానంద్ ఎదుట ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

కుత్బుల్లాపూర్: తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని... మిగిలిన పనులను పూర్తి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు, కాలనీలు, బస్తీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ... ఎక్కడో ఢిల్లీలో ఉండే నాయకత్వం మనకు అవసరం లేదన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధిని ఆకాంక్షించే సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్, ఇంద్రసింగ్‌నగర్, వాణీనగర్, ఎల్లమ్మ టెంపుల్‌రోడ్డు, కాకతీయనగర్, మల్లికార్జుననగర్, అంబేద్కర్‌నగర్, చెరుకుపల్లి కాలనీ, రామకృష్ణనగర్, సంజీవయ్యనగర్, వాజ్‌పేయ్‌నగర్, దత్తాత్రేయనగర్‌ల్లో ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పారిజాత, మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీష్, బొద్దు వెంకటేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్‌సిఎల్ పార్క్, ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, ఉమామహేశ్వరకాలనీ, వెన్‌సాయి, శ్వేతా శుభం, జయభేరి, శ్రీనివాస్‌నగర్‌కాలనీ, కొంపల్లి విలేజ్, సెంట్రల్ పార్క్, దూలపల్లి ఎస్సీ కాలనీ, దూలపల్లి విలేజ్, 120 గజాలు కాలనీ, 60 గజాలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ సోమేశ్‌యాదవ్, వార్డు సభ్యులు, వార్డ్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ పరిధి అంగడిపేట, ఓమ్ బుక్స్ అపార్ట్‌మెంట్స్, రామరాజు నగర్, జీడిమెట్ల విలేజ్, కుత్బుల్లాపూర్, జయరాం నగర్, అయోధ్య నగర్, వినాయక నగర్, కృష్ణకుంజ్ ప్రాంతాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వివేకానంద్ పాల్గొన్నారు.

**తండ్రి విజయం కోసం తనయుడి ప్రచారం..**

◆ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ అతని తనయుడు కేపీ విధాత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లో తన తండ్రితో కలిసి ప్రచారంలో పాల్గొనడం కార్యకర్తల్లో జోష్ నింపింది.

## తోట చంద్రశేఖర్ వ్యాఖ్యలపై కాపు నేతల మండిపాటు



కుత్బుల్లాపూర్: ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలపై కుత్బుల్లాపూర్ కాపు సంఘం నేతలు మండి పడ్డారు. సోమవారం గాజులరామారంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ వివేకానంద్ కాపుల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. తోట చంద్రశేఖర్ జనసేనతో తెగతెంపులు చేసుకొని కేసీఆర్ కాళ్ల దగ్గర మోకరిల్లినప్పుడే కాపులతో సంబంధం తెగిపోయిందన్నారు. 2000 గజాల స్థలాన్ని కాపు సంఘం భవనానికి ఇస్తామని మోసం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మళ్లీ ఎట్లా ఓట్లు అడుగుతున్నారని మండి పడ్డారు.

◆ మా కాపు కులదేవుడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను కూల్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదని.. బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయిన వాళ్లతో మాట్లాడించడం కాదు. కాపులకు నువ్వేం చేసావో చెప్పమని వివేకానంద్ విలేకరుల సమావేశం వేదికగా ప్రశ్నించారు.

◆ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకే కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతు ఇచ్చామన్నారు. కూన శ్రీశైలంగౌడ్‌కు ఓటేస్తే పవన్‌కళ్యాణ్‌కు ఓటేసినట్టేనని అన్నారు. సీఎం కేసీఆర్‌కు అమ్ముడుపోయిన తోట చంద్రశేఖర్ లాంటి వారి మాటలు కాపులు నమ్మరన్నారు. కుత్బుల్లాపూర్‌లో కాపులంతా కూన శ్రీశైలంగౌడ్ వెంటే ఉన్నామన్నారు. కాపు సంఘం నాయకులు సత్తి ఏసుబాబు, పుప్పాల మధు, పక్కల దుర్గారావు, సత్యనారాయణ, గోరిశెట్టి శ్రీనివాసరావు, పూర్ణ చంద్రరావు, కొట్టే రమణ, సత్యనారాయణరావు, ఏ. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమి శోభ





సుభాష్‌నగర్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గాజులరామారం చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో లక్ష దీపార్చన నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. మెట్కానిగూడలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి కల్యాణం అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

## కూనకు మద్దతుగా యూపీ సీఎం ట్వీట్




కుత్బుల్లాపూర్: ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదివారం కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా షాపూర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్ షో విషయాన్ని ప్రస్తావిస్తూ గొప్ప సభగా అభివర్ణించారు. ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఫొటోలు షేర్ చేయడం విశేషం. సీఎం యోగి ఆదిత్యనాథ్ వస్తున్న విషయంపై ఉత్తర భారతీయులు పెద్ద ఎత్తున సభకు హాజరయ్యారు. సుమారు 50వేలకు పైగా జనం రావడంతో ఒక్కసారిగా షాపూర్‌నగర్ ప్రధాన రహదారి జాతరను తలపించింది.

**బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం..**

షాపూర్‌నగర్‌లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సభకు పెద్ద ఎత్తున జనం రావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా యోగి చేసిన ప్రచారం ఆకట్టుకుంది. శ్రీశైలం గౌడ్‌ను గెలిపిస్తే అయోధ్యలో రామ మందిరానికి ఆహ్వానిస్తానని పేర్కొనడం విశేషం. ఏది ఏమైనా యోగి రాకతో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపిందని చెప్పవచ్చు.


షాపూర్‌నగర్ మార్కెట్‌లో మహిళకు నమస్కరిస్తూ...


కూన ప్రచారంతో కాషాయమయమైన షాపూర్‌నగర్ రోడ్డు


ఓ వృద్ధురాలి ఆశీర్వాదం తీసుకుంటున్న కూన

# కమలం గుర్తుకే ఓటేయండి

## బీజేపీ ప్రభుత్వాన్ని స్థాపించండి

- ప్రచార సభలో కుత్బుల్లాపూర్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్
- ఎమ్మెల్యేకు సవాల్.. చెప్పినట్టే వచ్చిన శ్రీశైలంగౌడ్
- గంట వరకు ఎదురు చూసినా రాని ఎమ్మెల్యే
- చర్చకు రమ్మంటే ముఖం చాటేశాడని విమర్శ
- ఎమ్మెల్యే రాకపోవడంతో యథావిధిగా నియోజకవర్గంలో ప్రచారం చేసిన కూన


గాజులరామారం చిత్తారమ్మ ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై మాట్లాడితే ఎమ్మెల్యేకు కోపమొస్తుందని.. పబ్లిక్ డిబేట్‌లో తనపై దాడి చేసిన ఆయన తొమ్మిదేళ్ల పాలనలో ఏమి చేశాడో చెప్పాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం యోగి ఆదిత్యనాథ్ రోడ్‌షో సందర్భంగా ఎమ్మెల్యేకు సవాల్ విసిరిన శ్రీశైలంగౌడ్ సోమవారం ఉదయం 10గంటలకు గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. సుమారు గంట సేపు ఎమ్మెల్యే రాక కోసం ఎదురు చూసిన ఆయన ఆపై ఎన్నికల ప్రచారానికి వెళ్లారు.

**100 పడకల ఆస్పత్రి ఏమయ్యింది..**

ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై చర్చకు రమ్మంటే ఎమ్మెల్యే ముఖం చాటేశాడన్నారు. గతంలో ఇచ్చిన హామీలు, భూకబ్జాలపై ప్రశ్నించినందుకే తనపై లైవ్ డిబేట్‌లో దాడి చేశాడని ఆరోపించారు. గత ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి 100 పడకల ఆస్పత్రి, హెచ్ఎంటీ స్థలంలో బస్సు డిపో తీసుకొస్తానని ప్రగల్భాలు పలికాడని ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

**ఓట్లు అడిగే అర్హత వివేకానంద్‌కు లేదు..**

ఎమ్మెల్యే వివేకానంద తొమ్మిదేళ్ల పాలన భూ కబ్జాలు, సెటిల్మెంట్లు, దందాలతోనే సరిపోయిందని విమర్శించారు. ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్‌లు, పింఛన్‌లు మంజూరు చేయించలేని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేకానందకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. నిజాంపేట్‌లో రోడ్లు బాగాలేక ఒక చిన్నారి చనిపోయింది బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనేనని అన్నారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటే..**

బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసినా అది బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోకి వెళ్తుందన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాటలతోనే కాలం గడిపాడన్నారు. కుత్బుల్లాపూర్ ప్రజలారా తస్మాత్ జాగ్రత్త.. మళ్లీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే ఆగమైతారని సూచించారు. తనను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కమలం గుర్తుకు ఓటేసి బీజేపీ ప్రభుత్వాన్ని స్థాపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

**మార్కెట్‌లో కొనుగోలుదారులతో..**

షాపూర్‌నగర్ మార్కెట్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ ప్రచారం నిర్వహించారు. మార్కెట్‌లో కొనుగోలుదారులను, వ్యాపారులను పలకరిస్తూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌గౌడ, నాయకులు దుర్యోధన్‌రావు, నాగిళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రంగారెడ్డినగర్ నుంచి ప్రశాంత్‌నగర్ వరకు రోడ్డు వేయిస్తా..

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్, గురుమూర్తి నగర్, గూడెన్‌మెట్, ఏపీహెచ్‌బీ కాలనీ, బీజేఆర్ కాలనీ, ఇందిరాగాంధీ నగర్ బస్తీల్లో, చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో శ్రీశైలంగౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రంగారెడ్డినగర్ నుంచి ప్రశాంత్‌నగర్ వరకు ఐడీపీఎల్ స్థలం మీదుగా రోడ్డు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.



## హెల్మెట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలి

స్వతంత్ర అభ్యర్థి సాయికుమార్ పంతుల

దుండిగల్: విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న యువనేత సాయికుమార్ పంతుల స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. గత కొన్నేళ్లుగా విద్యార్థుల హక్కులపై పోరాడుతూనే స్థానిక సమస్యలపై గళమెత్తుతూ వచ్చాడు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తు ఓటర్లను ఆకట్టుకుంటున్నాడు. విద్యార్థి, నిరుద్యోగుల గొంతుకనై వస్తున్న తనను ఆదరించాలన్నారు. హెల్మెట్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతున్నాడు. యువకుల్లో మంచి పేరు ఉన్న సాయికుమార్‌కు మద్దతుగా పలు యువజన సంఘాల నేతలు సైతం ప్రచారం నిర్వహిస్తున్నారు.

## కైసర్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసీపీ వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్, దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లలో సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో సూరారం, దుండిగల్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాన్వీ, ఇషికకు బెస్ట్ ట్యాలెంట్ అవార్డు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన శాన్వీ (9 ఏళ్లు), ఇషిక (నాలుగేళ్లు) క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సిరాజ్ డ్యాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీలో నగరంలో సకల కళా ఉత్సవ్ వేడుకలను నిర్వహించారు. అందులో క్రీడల విభాగంలో శాన్వీ, ఇషికలు బెస్ట్ టాలెంట్ అవార్డులు సాధించారు. వీరికి సినిమా డైరెక్టర్లు రామకృష్ణ పరమహంస, శరత్‌బాబు తదితరులు ట్రోఫీతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

## పనులు పూర్తి చేయారు.. ప్రమాదాలు ఆగవు

సుభాష్‌నగర్: ఎన్నో ఏళ్లుగా కొంపల్లి - బహదూర్‌పల్లి రోడ్డు పనులు దూలపల్లి మీదుగా మొదలుపెట్టడం.. నిలిపేయడం పరిపాటిగా మారింది. దీంతో రోడ్డంతా కంకర తేలి ఉండటంతో సోమవారం తెల్లవారుజామున 5.30గంటలకు దూలపల్లిలోని గాంధీ విగ్రహం సమీపంలోని దుర్గాకాలనీ వెళ్లే మూల మలుపు వద్ద ఒక పెద్దాయన బైక్‌పై వెళ్తుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడి మోకాళ్ల నుంచి కింద భాగం ఛిద్రమైంది. కొన ఊపిరితో ఆ వృద్ధుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. పనులు తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.